# సాక్షి నల్లగొండ

సోమవారం । 29 । సెప్టెంబర్ । 2025







**కష్టపడ్డారు.. ఫలితం దక్కింది**
టీజీపీఎస్సీ గ్రూప్–2 ఫలితాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఉద్యోగాలు సాధించారు. - 8లో



**భక్తుల రద్దీ సాధారణం**
యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. - 8లో

**సాగర్ సమాచారం**



| | | |
|---|---|---|
| పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు | | |
| ప్రస్తుత నీటి మట్టం | : | 585.80 అడుగులు |
| ఇన్‌ఫ్లో | : | 5,88,743 క్యూసెక్కులు |
| అవుట్ ఫ్లో | : | 5,88,743 క్యూసెక్కులు |
| విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా | : | 33,130 క్యూసెక్కులు |
| కుడికాల్వ ద్వారా | : | 8,529 క్యూసెక్కులు |
| ఎడమకాల్వ ద్వారా | : | నిల్ |
| ఏఎమ్మార్పీకి | : | 1,200 క్యూసెక్కులు |
| వరద కాల్వకు | : | నిల్ |

## న్యూస్‌రీల్

### నేడు రేషన్ డీలర్ల బైక్ ర్యాలీ

నల్లగొండ : రేషన్ డీలర్లకు ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు రావాల్సిన కమిషన్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సోమవారం నల్లగొండలో శాంతియుత బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బైక్ ర్యాలీ ఎన్జీ కాలేజీ నుంచి ప్రారంభమై కలెక్టరేట్ వరకు సాగుతుందని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి రేషన్ డీలర్లు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

### మూసీకి కొనసాగుతున్న వరద



మూసీ క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు పోతున్న వరదనీరు

కేతేపల్లి : మూసీ రిజర్వాయర్‌కు వరద కొనసాగుతోంది. మూసీ ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కాస్త తగ్గుముఖం పట్టడంతో ఆదివారం ఇన్‌ఫ్లో తగ్గింది. శనివారం 39 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. ఆదివారం 20,936 క్యూసెక్కులకు తగ్గింది. దీంతో ఆరు క్రస్ట్‌గేట్లను మూడు అడుగుల మేర పైకెత్తి 11,231 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మూసీ కుడి, ఎడమ కాల్వలకు 185 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

### బీసీ రిజర్వేషన్లకు సీపీఐ మద్దతు

చిట్యాల : స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడానికి సీపీఐ మద్దతిస్తుందని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. చిట్యాలలో ఆదివారం ఆయన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ జనాభా ప్రాతిపదికను 42 శాతం రిజర్వేషన్ అమలు ప్రక్రియకు అన్ని పార్టీలు మద్దతు ఇచ్చినా.. కొందరు కోర్టుకు వెళ్లడం తగదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగకపోవటంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని, సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమలకు అనుకూలంగానే ట్రిపుల్ ఆర్ అలాయిమెంట్ మార్చారని ఆరోపించారు. చిట్యాల మండలంలో అక్రమంగా మైనింగ్‌పై ఫిర్యాదు చేస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్, బొడిగె సైదులుగౌడ్, అక్బర్, జిల్లా సత్యం, షరీఫ్, జిల్లా యాదయ్య, మునుకుంట్ల నాగయ్య, బాలరాజు, లింగయ్య పాల్గొన్నారు.

### నృసింహుడి సన్నిధిలో కోలాహలం

యాదగిరిగుట్ట రూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు, సంప్రదాయ పర్వాలు, భక్తజన సందోహంతో యాదగిరి క్షేత్రంలో కోలాహలం నెలకొంది. ఆదివారం వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూ, సువర్ణ ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలు అర్పించి సహస్రనామార్చనతో కొలిచారు. ఆ తరువాత ప్రథమ ప్రాకార మండపంలో శ్రీ సుదర్శన నారసింహ హోమం, గజవాహనసేవ, ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖమండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు గావించారు. సాయంత్రం స్వామి వారికి వెండిజోడు సేవోత్సవం నిర్వహించి భక్తుల మధ్య ఊరేగించారు. వివిధ పూజా కార్యక్రమాల్లో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి స్వామి వారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.



బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆదివాదం నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో బతుకమ్మ ఆడుతున్న టీఎన్‌జీఓస్ ఉద్యోగులు

### 150 ఎంపీటీసీలు మహిళలకే..

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లాలో ఎంపీటీసీల రిజర్వేషన్ ప్రకటించారు. జిల్లాలో మొత్తం 353 ఎంపీటీసీ స్థానాలు ఉండగా అందులో 150 మహిళలకే కేటాయించారు. 203 ఎంపీటీసీ స్థానాల్లో ఆయా కేటగిరీల వారీగా జనరల్‌కు కేటాయించారు. ఎస్టీ రిజర్వేషన్ కింద 55 ఎంపీటీసీ స్థానాలు రిజర్వు కాగా అందులో 22 మహిళలకు, 33 జనరల్‌కు కేటాయించారు. ఎస్సీలకు 61 ఎంపీటీసీ స్థానాలు రిజర్వు కాగా అందులో 24 మహిళలకు 37 ఎస్సీ జనరల్‌కు, బీసీలకు 144 ఎంపీటీసీ స్థానాలు రిజర్వు చేయగా అందులో మహిళలకు 65, జనరల్‌కు 79 కేటాయించారు. అన్‌రిజర్వు కింద మొత్తం 93 స్థానాలు ఉండగా.. అందులో మహిళలకు 39 రిజర్వు అయ్యాయి. 54 స్థానాలు జనరల్‌కు కేటాయించారు.

# మహిళా సంఘాలకు చీరలు

- స్వయం సహాయక మహిళా సంఘాలకు డ్రెస్ కోడ్ ఉండేలా ఒకే కలర్ చీరల పంపిణీకి సన్నాహాలు
- ఒక్కో సభ్యురాలికి రెండు చీరలు ఇవ్వాలని నిర్ణయం
- నవంబర్ 19 ఇందిరాగాంధీ జయంతి రోజున ఒక చీర పంపిణీ
- జిల్లాకు చేరిన లక్షా 20 వేల చీరలు



పంపిణీ చేయనున్న చీరలు

నల్లగొండ : బతుకమ్మ చీరలు ఈసారి కూడా లేనట్టే. స్వయం సహాయక సంఘాల సభ్యులకు మాత్రమే చీరలు పంపిణీ చేయనున్నారు. ఇందిరా మహిళా శక్తి సంఘాల పేరుతో ఒక్కో సభ్యురాలికి సంవత్సరానికి రెండు చొప్పున చీరలు ఇస్తారు. నవంబర్ 19న ఇందిరాగాంధీ జయంతి రోజున చీరలు పంపిణీ చేయనున్నారు. సంఘం సమావేశాలకు సభ్యులంతా డ్రెస్ కోడ్‌తో హాజరయ్యేలా.. ఒకే కలర్ చీరను ధరించి రావాలని భావించి అందరికీ బ్లూ కలర్ చీరలను పంపిణీ చేయనున్నారు.

**ప్రస్తుతం ఒక చీర**

గత ప్రభుత్వం మహిళలందరికీ ఏటా బతుకమ్మ చీరలను అందించింది. 18 సంవత్సరాలు నిండిన మహిళకు రేషన్‌షాపుల చీరలు పంపిణీ చేసింది. అయిత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇందిరా మహిళా శక్తి పథకం కింద సెర్ప్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాల సభ్యులకు, మున్సిపాలిటీల్లో మెప్మా ఆధ్వర్యంలోని మహిళా సంఘాల సభ్యులకు ఏటా రెండు చీరలు అందించాలని నిర్ణయించింది. అందులో భాగంగా మొదటి విడతగా ఒక చీరను అందించనుంది.

**బతుకమ్మ చీరలుగా ప్రచారం**

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏడాది బతుకమ్మ పండుగకు మహిళలకు చీరలు ఇవ్వలేకపోయింది. ఈసారి ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఒక్కొక్కరికి రెండు చీరలు ఇవ్వాలనే ఉద్దేశంతో నేతన్నలకు పని కల్పిస్తున్నామని సీఎం సైతం అన్నారు. అయితే ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తామన్న చీరలు మహిళా సంఘాల సభ్యులకని, ఏడాదికి రెండు చీరలు ఇస్తున్నామని ప్రకటించారు. సంఘాల్లో లేని మహిళలకు చీరలు ఎందుకు ఇవ్వరన్న చర్చ మొదలైంది.

**జిల్లాలో 3,66,955 మంది మహిళా సంఘాల సభ్యులు**

జిల్లాలో మొత్తం 3,66,955 మంది మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు. వారందరికీ చీరలు ఇవ్వాలని ఇవ్వనున్నారు. అయితే మొదటి విడతగా ఒక్కో చీర మాత్రమే ఇవ్వనున్నారు. అందుకు సంబంధించి ఇప్పటికే జిల్లాకు లక్షా 20 వేల చీరలు వచ్చాయి. వాటిని జిల్లాలోని చండూర్, చింతపల్లి, మిర్యాలగూడ మార్కెటింగ్ గోదాముల్లో భద్రపరిచారు. మిగతా చీరలు కూడా త్వరలోనే జిల్లాకు వస్తాయని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేఖర్‌రెడ్డి తెలిపారు.

# బస్టాండ్‌కు మరమ్మతు చేయాలి



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

- రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

మిర్యాలగూడ : ఆర్టీసీ బస్టాండ్‌కు మరమ్మతు చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం మిర్యాలగూడలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన ఆయన బస్టాండ్‌ను తనిఖీ చేశారు. బస్టాండ్‌లో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న మరమ్మతు పనులను సత్వరమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. బస్టాండ్‌లో పెచ్చులు ఊడిన చోట త్వరితగతిన మరమ్మతు పనులు చేయాలన్నారు. ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు ఎమ్మెల్యే కాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో గౌడ సంఘం భవనానికి రూ.50 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, ఉదయ్‌భాస్కర్‌గౌడ్, చొగాని వెంకన్నగౌడ్, గురుమూర్తి, పెద్ది శ్రీనివాస్‌గౌడ్, జెర్రిపోతుల రాములుగౌడ్, ఆర్టీసీ అధికారులు ఉన్నారు.

# వాడపల్లి ఎస్‌ఐని సస్పెండ్ చేయాలి

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



సాయిసిద్ధును పరామర్శిస్తున్న వెంకటయ్య

మిర్యాలగూడ : దామరచర్ల మండలం కొత్తపేటతండాకు చెందిన గిరిజనుడు సాయిసిద్ధుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన వాడపల్లి ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డిని విధుల నుంచి సస్పెండ్ చేసి సమగ్ర విచారణ చేపట్టాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఎస్పీని ఆదేశించారు. ఆదివారం ఆయన దామరచర్ల మండలం కొత్తపేటతండాకు వెళ్లి బాధితుడు సాయిసిద్ధును పరామర్శించి మాట్లాడారు. సాయిసిద్ధును అకారణంగా కొట్టడమే కాకుండా వారి కుటుంబంపై తీవ్ర పదజాలంతో దూషించడం, థర్డ్ డిగ్రీని ప్రయోగించడం తగదన్నారు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన ఎస్‌ఐ ఈ రకంగా ప్రవర్తిస్తే కంచే చేను మేసిన తీరుగా ఉందన్నారు. ఎవరైనా తప్పు చేస్తే శిక్షించేందుకు చట్టం ఉందని.. కొట్టాల్సిన అవసరం లేదని, కొట్టే అధికారం ఎవరికీ లేదన్నారు. ఈ విషయమై ఎస్సీ శాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో ఇప్పటికే మాట్లాడానని.. సీఎంతో కూడా మాట్లాడుతానని తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఉన్నతాధికారులతో చర్చిస్తానని తెలిపారు. ఆయన వెంట ఎస్సీ కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, రాథోడ్ రాంబాబు, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి శశికళ, గిరిజన సంక్షేమ అధికారి ఛత్రునాయక్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, తహసీల్దార్ జవహర్‌లాల్ తదితరులు ఉన్నారు.

### మహాచండీ అలంకారంలో అమ్మవారు



కనగల్ : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కనగల్ మండలంలోని ధర్వేశిపురం రేణుక ఎల్లమ్మ మహాచండీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయం వద్ద అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ అంబటి నాగిరెడ్డి, అర్చకులు నాగోజు మల్లాచారి, సీహెచ్ శ్రవణ్ కుమారాచార్యులు, గాదె ఉమామహేశ్వరరావు, దామోదర్‌రావు పాల్గొన్నారు.

మహాచండీ అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

# హామీలను గాలికొదిలేసిన కాంగ్రెస్

- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి
- తిప్పర్తిలో ఇంటింటికీ కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ



కాంగ్రెస్ బాకీ కార్డులు పంచుతున్న జగదీశ్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి నాయకులు

తిప్పర్తి : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఇప్పుడు గాలికొదిలేసిందని మాజీమంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలపై బీఆర్‌ఎస్ పార్టీ తీసుకొచ్చిన కాంగ్రెస్ బాకీ కార్డులను ఆదివారం తిప్పర్తి మండలం కేంద్రంలో ఇంటింటికి పంచారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కర్నాటక ప్రభుత్వం అల్మట్టి డ్యాం ఎత్తు పెంచాలని చూస్తోందని.. దానివల్ల నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాలు ఎడారిగా మారతాయన్నారు. ఆ విషయంపై ఇక్కడ ఉన్న అధికార పార్టీకి సోయిలేదని.. బీఆర్‌ఎస్ పార్టీ తరఫున నల్లగొండ జిల్లా రైతులతో కలిసి చలో అల్మట్టి కార్యక్రమం చేపడతామని తెలిపారు. ఇరిగేషన్ మంత్రికి ఆల్మట్టిపై సోయిలేదని.. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి నీళ్ల గురించి అవగాహన లేదని విమర్శించారు. అధికారం కోసం అడ్డగోలు హామీలిచ్చి అమలు చేయడంలో విఫలమయ్యారని.. కాంగ్రెస్ మోసాన్ని ఎండగడుతూ కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిషోర్‌కుమార్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ తండు సైదులుగౌడ్, నాయకులు కందుల లక్ష్మయ్య, వనపర్తి నాగేశ్వర్‌రావు, లొడంగి గోవర్ధన్, సిరసవాడ సైదులు, బైరగోని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అతివలకు ఆరోగ్య భరోసా

- పీహెచ్‌సీల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు
- అక్టోబరు 2వ తేదీ వరకు నిర్వహణ
- అన్ని రకాల వైద్య పరీక్షలు.. ఉచితంగా మందులు అందజేత



ఆరోగ్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

నల్లగొండ టౌన్: ఒక కుటుంబం శక్తివంతంగా ఉండాలంటే ఆ ఇంట్లోని మహిళ ఆరోగ్యంగా ఉండాలని అంతా చెబుతుంటారు. కానీ, ఈ మధ్యకాలంలో మహిళలు, యువతులు, బాలికలు వివిధ ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్నారు. వారి ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాలో స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ (ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబం) అనే కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ప్రతి పీహెచ్‌సీలో మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 17న ప్రారంభమైన ఈ వైద్య శిబిరాలు అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి వరకు నిర్వహించనున్నారు. మొత్తం 13 వైద్య బృందాలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అవుతున్నాయి.

**ఆరోగ్య పరీక్షలు, అవగాహన..**

సాధారణంగా మహిళలు ఆరోగ్య సమస్యలపై ఇబ్బందులు పడుతుంటారు. దీంతో ఈ వైద్య శిబిరాల్లో అధిక రక్తపోటు, మధుమేహం, చర్మవ్యాధులు, చెవి, ముక్కు, గొంతు, దంత, రక్తహీనత, స్త్రీ వ్యాధి సమస్యలు, క్యాన్సర్, గుండె, కిషోర బాలికలు, కౌమార దశలో వచ్చే సమస్యలపై ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ వైద్య శిబిరాల్లో గైనకాలజీ, ఈఎన్‌టీ, డర్మటాలజీ, సైకియాట్రి, జనరల్ ఫిజిషియన్, దంత సంబంధిత వైద్యులు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందిస్తున్నారు. పౌష్టికాహార ఆవశ్యకతను వివరించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కౌన్సిలింగ్ ఇస్తున్నారు. పిల్లలు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు. క్షయ వ్యాధి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

**సద్వినియోగం చేసుకోవాలి**



స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే వైద్య శిబిరాలను మహిళలు, యువతులు, బాలికలు సద్వినియోగం చేసుకోవాలి. ఈ శిబిరాల్లో ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారు. రక్త పరీక్ష నిర్వహించి వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తారు.

– పుట్ల శ్రీనివాస్, డీఎంహెచ్‌ఓ, నల్లగొండ

### పానగల్లు ఆలయాలను అభివృద్ధి చేస్తాం

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని పానగల్లు పచ్చల, ఛాయా సోమేశ్వరాలయాలను అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పురావస్తు శాఖ సంచాలకుడు, ప్రొఫెసర్ కుతాడి అర్జునరావు అన్నారు. ఆదివారం ఆయన పానగల్‌లోని ఆలయాలను, మ్యూజియంను సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి పురావస్తు శాఖ రూపొందించిన అంచనాలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. భక్తులు, పర్యాటకులకు ఆలయాల చరిత్ర తెలిసేలా సైన్‌బోర్డులు, వివరణాత్మక బోర్డులు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆలయ గోడలపై ఉన్న వైట్‌వాష్‌ను వెంటనే శుభ్రం చేసి, శిల్ప సంపద, చరిత్ర భక్తులు, పర్యాటకులు తెలుసుకునేలా చూడాలని సూచించారు. ఆలయ చరిత్ర వివరించడానికి ఒక టూరిస్ట్ గైడ్‌ను నియమించాలన్నారు. అనంతరం జిల్లా పురావస్తు మ్యూజియం తనిఖీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పురావస్తు శాఖ ఉపసంచాలకుడు డాక్టర్ పి.నాగరాజు, ఎస్.నర్సింగ్ నాయక్, డాక్టర్ హమ్మద్ షరీఫ్, డాక్టర్ కిషోర్, పల్‌రెడ్డి వెంకటరెడ్డి, గుండగోని యాదయ్య, కొడిదల ఎల్లయ్య, గుండగోని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఛాయా సోమేశ్వరాలయాన్ని పరిశీలిస్తున్న అర్జునరావు

# మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక




నూతనంగా ఎన్నికైన మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ పాలకవర్గం నూతన కమిటీ సభ్యులు

- అధ్యక్షుడిగా గౌరు శ్రీనివాస్, కార్యదర్శిగా వెంకటరమణచౌదరి ఏకగ్రీవం
- మిగతా స్థానాలకు ఎన్నికలు



గౌరు శ్రీనివాస్, అధ్యక్షుడు



వెంకటరమణచౌదరి, కార్యదర్శి

మిర్యాలగూడ : మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన పాలకవర్గం 2025- 27 ఎన్నిక ఆదివారం పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో జరిగాయి. ఎన్నికల అధికారిగా రిటైర్డ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పందిరి రవీందర్ వ్యవహరించారు. మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గౌరు శ్రీనివాస్, కార్యదర్శి -1గా వెంకటరమణచౌదరి( బాబి), కార్యదర్శి–2గా పాలిశెట్టి ధనుంజయలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిల్లర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో మొత్తం 90 ఓటర్లు కాగా ఉపాధ్యక్ష పదవి కోసం మాశెట్టి శ్రీనివాస్, గోళ్ల రామశేఖర్ పోటీపడగా మాశెట్టి శ్రీనివాస్‌కు 15ఓట్లు, రామశేఖర్‌కు 69ఓట్లు వచ్చాయి. దీంతో రామశేఖర్ విజయం సాధించారు. కోశాధికారి పదవికి చిల్లంచర్ల శ్రీనివాస్, గండె రాము పోటీ పడగా శ్రీనివాస్‌కు 42ఓట్లు, రాముకు 44ఓట్లు వచ్చాయి. దీంతో రాము విజయం సాధించారు. పది డైరక్టర్ల పదవులకు 30 నామినేషన్లు రాగా డ్రా పద్ధతిలో పది మందిని ఎంపిక చేశారు. డైరెక్టర్లుగా గౌరు శంకర్, నీలా పాపారావు, పోతుగంటి గోపి, ఆతుకూరి గురునాథం, గుర్రం వెంకటరత్నం, శ్రీరంగం నర్సయ్య ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి రవీందర్ ప్రకటించారు. నూతన పాలకవర్గాన్ని పలువురు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, గుడిపాటి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు చిల్లంచర్ల విజయ్‌కుమార్, మంచుకొండ వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ చైర్మన్ తిరునగరు భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

- పాల నురగలా.. పరవళ్లు



నాగార్జునసాగర్ 26 క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు పరుగులు తీస్తున్న కృష్ణమ్మ

## క్లుప్తంగా

### సంతానం కలగడం లేదని వివాహిత ఆత్మహత్య


అశ్విని (ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్: సంతానం కలగడం లేదని మనోవేదనకు గురైన వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. ఆదివారం యాదగిరిగుట్ట సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూరుకు చెందిన గుంటికాపుల అశ్విని (30)కి యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామానికి చెందిన క్లెపల్లి రాఘవేంద్రతో 2015లో వివాహం జరిగింది. వివాహం జరిగి పదేళ్లు అవుతున్నా వారికి సంతానం కలుగలేదు. ఈ విషయమై భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. సంతానం కోసం డాక్టర్లను సంప్రదించినా ఫలితం లేకపోయింది. దీంతో మనోవేదనకు గురైన అశ్విని గతంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ క్రమంలో శనివారం రాత్రి 9గంటల ప్రాంతంలో వంగపల్లిలోని తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి అశ్వినిని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే ఆమె మృతిచెందిందని వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తల్లి గుంటికాపుల శారద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు యాదగిరిగుట్ట సీఐ భాస్కర్ తెలిపారు.

### సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్‌కు ఉత్తమ అవార్డు


ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు అందుకుంటున్న కంది భజరంగ్ ప్రసాద్

రామగిరి: ఫొటోజెనిక్ ఆర్ట్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించిన పోటీల్లో నల్లగొండ సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ కంది భజరంగ్ ప్రసాద్‌కు ఉత్తమ ఫొటో జర్నలిస్ట్‌గా అవార్డు లభించింది. ఆదివారం ఏపీలోని గుంటూరు జిల్లా మోదుకూరు వేమన సాహిత్య వికాస భవనంలో ఆంధ్ర లయోలా కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సింగారెడ్డి మెల్కియార్, అకాడమీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్, విజువల్ కమ్యూనికేషన్ హెచ్‌ఓడీ గద్దం రాయప్ప, పురావస్తు పరిశోధకులు డాక్టర్ ఏమని శివనాగిరెడ్డి చేతులమీదుగా భజరంగ్ ప్రసాద్ అవార్డు అందుకున్నారు.

# కష్టపడ్డారు.. ఫలితం దక్కింది

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) ఆదివారం విడుదల చేసిన గ్రూప్–2 ఫలితాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఉద్యోగాలు సాధించారు. కొందరు ఉన్నత ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో కొన్నేళ్లుగా గ్రూప్స్‌కు సన్నద్ధమవుతూ విజయం సాధించగా.. మరికొందరు ఇప్పటికే పలు ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ గ్రూప్–2 ఉద్యోగాలు సాధించారు.

#### మూడు ప్రభుత్వ ఉద్యోగాలు


మోర్తా రాంనర్సిరెడ్డి

మాడుగులపల్లి: మాడుగులపల్లి మండలం అభంగాపురం గ్రామానికి చెందిన మోర్తాల రాంనర్సిరెడ్డి గ్రూప్–2 ఫలితాల్లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించారు. రాంనర్సిరెడ్డి చిన్నతనంలోనే అతడి తండ్రి శేఖర్‌రెడ్డి మృతిచెందగా.. పట్టుదలతో చదివి గ్రూప్–2, 3 ఉద్యోగాలు సాధించారు. అంతే కాకుండా హైకోర్టు అసిస్టెంట్ ఫలితాల్లో కూడా మెరిట్ పొంది ఇటీవల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకున్నారు. ఒకేసారి మూడు ఉద్యోగాలు పొందిన రాంనర్సిరెడ్డిని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

#### వ్యవసాయ కుటుంబం నుంచి గ్రూప్–2 ఉద్యోగం సాధించి..


బొజ్జ శ్యామ్

నిడమనూరు: గ్రూప్–2 ఫలితాల్లో నిడమనూరు మండలం శాఖాపురం గ్రామానికి చెందిన బొజ్జ శ్యామ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్(కోఆపరేటివ్ సొసైటీస్) ఉద్యోగానికి ఎంపికయ్యారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఎంఎస్‌డబ్ల్యూలో పీజీ పూర్తిచేసిన శ్యామ్ 2021 నుంచి పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. అశోక్ తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయం కుటుంబం నుంచి వచ్చి అశోక్ గ్రూప్–2 ఉద్యోగం సాధించడంతో గ్రామస్తులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

#### ఏఎస్‌ఓగా పంచాయతీ కార్యదర్శి..


అంగోతు నరేష్

చివ్వెంల : మండల పరిధిలోని రాజుతండా గ్రామ పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న అంగోతు నరేష్ ఆదివారం ప్రకటించిన గ్రూప్–2 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 717 ర్యాంకు సాధించి ఏఎస్‌ఓగా ఎంపికయ్యాడు. చివ్వెంల మండలం ఐలాపురం గ్రామ ఆవాసం అంగోతు తండాకు చెందిన నరేష్ 2019లో పంచాయతీ కార్యదర్శిగా ఎంపికై విధులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం గ్రూప్–2లో ఉత్తీర్ణత సాధించి ఏఎస్‌ఓగా ఎంపిక కావడం పట్ల తండావాసులు, సహ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఎస్టీ విభాగంలో రాష్ట్రస్థాయి 16వ ర్యాంకు సాధించినట్లు నరేష్ తెలిపాడు.

#### అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా హరిప్రీత్‌రెడ్డి


హరిప్రీత్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్–2 ఫలితాల్లో శాలిగౌరారం మండలంలోని మాదారం కలాన్ గ్రామానికి చెందిన కె.హరిప్రీత్ రెడ్డి కోపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉద్యోగం సాధించాడు. గతంలో ఆయన గ్రూప్–4 ఉద్యోగం సాధించి చిట్యాల మండలంలో విధులు నిర్వహిస్తున్నాడు. గ్రూప్–2 రాసిన మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించడం పట్ల ఆయన స్నేహితులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

#### జూనియర్ అసిస్టెంట్ నుంచి ఎంపీఓగా..


మైనం అశోక్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలం మైనవారిగూడెం గ్రామానికి చెందిన మైనం సుధాకర్, నాగమణి దంపతుల కుమారుడు మైనం అశోక్ ఆదివారం వెలువడిన గ్రూప్–2 ఫలితాల్లో మండల పంచాయతీ ఆఫీసర్(ఎంపీఓ)గా ఎంపికయ్యారు. మెకానికల్ ఇంజనీరింగ్ చేసిన అశోక్ గతంలో గ్రూప్–4కు ఎంపికై ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. అదేవిధంగా గ్రూప్–3లో కూడా ఉద్యోగం సాధించారు. ఇంకా ఉన్నతమైన ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఉన్నానని, అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తానని అశోక్ తెలిపారు. ఆయను తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు అభినందించారు.

#### కార్యదర్శి నుంచి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా..


కంచర్ల రాజశేఖర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : గ్రూప్–2 ఫలితాలలో భూదాన్‌పోచంపల్లి మండలం పిలాయిపల్లి పంచాయతీ కార్యదర్శి కంచర్ల రాజశేఖర్‌రెడ్డి సచివాలయం సాధారణ పరిపాలన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ఉద్యోగం సాధించాడు. 2019లో పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం సాధించి మండలంలోని జలాల్‌పురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధుల్లో చేరాడు. రాజశేఖర్‌రెడ్డిది స్వస్థలం చౌటుప్పల్ మండలం మల్కాపూర్ గ్రామం. తండ్రి లారీ డ్రైవర్ కాగా, తల్లి గృహిణి. స్థానికంగా జెడ్పీ హైస్కూల్ ఎస్సెస్సీ, చౌటుప్పల్‌లో ఇంటర్, నేతాజీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేశాడు. గ్రూప్ –2 ఫలితాలలో అసిస్టెంట్ సెక్షన్‌ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించడం పట్ల ఎంపీడీఓ భాస్కర్, ఎంపీఓ మాజిద్, సూపరిండెంట్ సత్యనారాయణ, తల్లిదండ్రులు, తోటి పంచాయతీ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

### చికిత్స పొందుతూ మృతి


మమత (ఫైల్)

మోత్కూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన చేకూరి మల్లేషం భార్య విజయనిర్మల అలియాస్ మమత (48) ప్రైవేట్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. ఆమె తన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం హైదరాబాద్ నుంచి కారులో ఆరెగూడెం వస్తుండగా.. భువనగిరి మండలం కుమ్మరిగూడెం సమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన మమతను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందింది. మృతురాలికి భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

## 18 గేట్ల ద్వారా 'పులిచింతల' నీటి విడుదల


గేట్లు ఎత్తడంతో దిగువకు విడుదలవుతున్న నీరు

మేళ్లచెరువు : ఎగువన ఉన్న నాగార్జున సాగర్ తోపాటు మూసీ ప్రాజెక్టులు, టెయిల్‌పాండ్ గేట్లు ఎత్తడంతో చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టుకు వరదనీరు భారీగా వచ్చిచేరుతుంది. ఆదివారం రాత్రి వరకు 6,00,685 క్యూసెక్కుల వరద రాగా ప్రాజెక్టు నీటిమట్టం పూర్తిస్థాయికి చేరినట్లు అధికారులు తెలిపారు. దీంతో 18 గేట్లను 4 నుంచి 5 మీటర్ల మేర పైకెత్తి అవుట్‌ఫ్లోగా 6,08,541 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. టీజీజెన్‌కో 16,600 క్యూసెక్కుల నీటిని ఉపయోగిస్తూ 4 యూనిట్ల ద్వారా 105 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు.

## విశిష్ట వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకోవాలి



కూరెళ్ల విఠలాచార్య, ఎన్. అశోక్‌ను సన్మానిస్తున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు తదితరులు

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు

రామన్నపేట: సమాజంలోని విశిష్ట వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ చేపట్టిన సేవా పక్షోత్సవంలో భాగంగా ఆదివారం పార్టీ రాష్ట్ర కమిటీ తరఫున రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యను, రాజకీయ రంగంలో దివ్యాంగుల పాత్ర అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ సాధించిన డాక్టర్ ఎన్. అశోక్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య కూరెళ్ల గ్రంథాలయం, బుద్ధ గ్రంథాలయంను కాసం వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు సందర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశంలోని అనేక మంది విశిష్ట వ్యక్తులు, ప్రాంతాలు, ప్రత్యేకతలను గుర్తించి ప్రపంచానికి పరిచయం చేశారని తెలిపారు. ఆయన వెంట నాయకులు నకిరేకంటి మొగులయ్య, మదూరి ప్రభాకర్‌రావు, మైల నర్సింహ, శాగ చంద్రశేఖర్‌రెడ్డి, మండల వెంకన్న, తాటిపాముల శివకృష్ణ, వనం అంజయ్య, బండ మధుకర్‌రెడ్డి, నకిరేకంటి మహేష్, చెరుపల్లి శ్రవన్, మొగిలి రమేష్, గూడెల్లి దామోదర్, గంజి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## బుద్ధవనాన్ని సందర్శించిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్


ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు బుద్ధుడి పుస్తకాన్ని అందిస్తున్న బుద్ధవనం సిబ్బంది

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని ఆదివారం స్వేరోస్ ఫౌండర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సందర్శించారు. రెండు రోజులుగా స్థానిక విజయ్ విహార్ సమావేశ మందిరంలో స్వేరోస్ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలకు హాజరైన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదివారం బుద్ధవనానికి వెళ్లారు. ధ్యానమందిరంలో ధాన్యం చేశారు. ఆయనకు మహాస్థూపంపై గల విగ్రహాల వివరాలను బుద్ధవనం గైడ్ వివరించారు. బుద్ధుడి పుస్తకాలను అందజేశారు.

### సినిమా సెట్టింగ్‌లా దుర్గాదేవి మండపం


పెద్దగూడెంలోని దుర్గాదేవి మండపం (ఇన్‌సెట్‌లో) లక్కీ డ్రాలో విజేతలకు ఇవ్వనున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లి మండల పరిధిలోని పెద్దగూడెం గ్రామంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం సినిమా సెట్టింగ్‌ను తలపిస్తోంది. మండపం బయట శివపార్వతులు, నందీశ్వరుడి విగ్రహాలతో పాటు మండపం సెట్టింగ్ పైన పలు దేవతా విగ్రహాలు ఆకట్టుకునేలా ఉన్నాయి. అదేవిధంగా ఈ మండపం వద్ద ఉత్సవ నిర్వాహకులు భక్తులకు లక్కీ డ్రా ఆఫర్లు పెట్టారు. రూ.201 చెల్లించి కూపన్ కొనుగోలు చేసిన భక్తులకు అక్టోబర్ 3న నిర్వహించే బంపర్ డ్రాలో మొదటి బహుమతిగా రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్, రెండో బహుమతిగా కలర్ టీవీ, మూడో బహుమతిగా కుక్కర్ ఓవన్, నాల్గవ బహుమతిగా 3 గ్రాముల సిల్వర్ కాయిన్ అందజేయనున్నట్లు

## భూ వివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

- వృద్ధ దంపతులకు గాయాలు



గాయపడిన రామయ్య, లక్ష్మి

పెద్దవూర: భూ వివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణలో వృద్ధ దంపతులకు గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం పెద్దవూర మండలం తుంగతుర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని రామన్నగూడెంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నగూడెం గ్రామానికి చెందిన నక్క రాములు, అతడి సోదరికి మధ్య కొంతకాలంగా భూ వివాదాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో రామయ్య సోదరి కుమారులైన రామలింగయ్య, శంకరయ్య రామయ్యతో పాటు అతడి భార్య లక్ష్మిపై దాడి చేశారు. దీంతో వారిద్దరి చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. గాయపడిన వృద్ధ దంపతులను చికిత్స నిమిత్తం నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పెద్దవూర పోలీసులు పేర్కొన్నారు.

## యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ సాధారణం


ఆలయ మాడ వీధిలో భక్తులు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆది వారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చారు. ఆలయ మాడ వీధుల్లో, ప్రసాద విక్రయశాలలో, క్యూలైన్లల్లో భక్తుల సందడి సాధారణంగా కనిపించింది. స్వామివారిని 30వేల మంది భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ మార్గాల ద్వారా స్వామివారికి నిత్యాదాయం రూ.20,63875 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

## వేల్స్‌లో లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవం


కల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట రూరల్: యునైటెడ్ కింగ్‌డమ్‌లోని వేల్స్ రాజధాని కార్డిఫ్ నగరంలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. యునైటెడ్ కింగ్‌డమ్ కార్డిఫ్ హిందూ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కల్యాణోత్సవంలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, అర్చకులు కిరణ్‌కుమార్‌చార్యులు, దోర్బాల భాస్కర్‌శర్మ బృందం పాల్గొన్నారు. ఈ కల్యాణోత్సవంలో డాక్టర్ వెలగపూడి బాపూజీరావు, అన్నపూర్ణ శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పథంలో సంఘమిత్ర బ్యాంకు


మాట్లాడుతున్న సంఘమిత్ర కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ సంగం రామకృష్ణ

నల్లగొండ టౌన్: సంఘమిత్ర కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తూ అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని బ్యాంకు ఫౌండర్ అండ్ చైర్మన్ సంగం రామకృష్ణ అన్నారు. ఆదివారం నల్లగొండలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన బ్యాంకు 54వ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. 1998లో స్థాపించబడిన సంఘమిత్ర కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఖాతాదారుల సేవే పరమావధిగా పనిచేస్తూ అందరి మన్ననలు పొందుతుందన్నారు. 983 మంది వాటాదారులతో రూ.160.35 లక్షల వాటా ధనం కలిగి ఉన్నట్లు తెలిపారు. 3138 మంది ఖాతాదారులతో రూ.90.82 కోట్ల డిపాజిట్లు సేకరించామన్నారు. 4395 మందికి రూ.80 కోట్ల మేర వివిధ రుణాలు ఇచ్చామని పేర్కొన్నారు. మొత్తం వ్యాపారం రూ.170.82 కోట్లకు పైబడి ఉందన్నారు. రూ.1.8 కోట్లతో బ్యాంకు లాభాల బాటలో పయనిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు వైస్ చైర్మన్ సన్నిదానం చక్రపాణి, డైరెక్టర్లు పున చండికేశ్వర్, కొంగరి భిక్షం, గుండ్ల అంజిరెడ్డి, బండ భిక్షంరెడ్డి, ఎర్రమల లక్ష్మీనర్సు, చెరుపల్లి పద్మ, వీరవల్లి భవాని, చంద్రశేఖర్, సీఈఓ వడ్డె శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.